# పింఛన్ల పెంపుపై యుద్ధభేరి

**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ**





**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

పింఛన్ల పెంపు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి తక్షణ నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే ప్రజల ఆగ్రహానికి గురవుతారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ హెచ్చరించారు. గురువారం స్థానిక సింగరేణి కళావేదికలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు రామగిరి మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పింఛన్‌దారుల సన్నాహక సభలో ఆయన ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి 20 నెలలు గడిచినా ప్రభుత్వం స్పందించకపోవడం అమానుషమని విమర్శించారు. 20 వేల కోట్ల రూపాయల పింఛన్ నిధులను రైతాంగానికి మళ్లించి వికలాంగులు, వితంతువులు, వృద్ధులను మోసం చేశారని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ కూడా ఈ అంశంపై నోరు విప్పకపోవడం దురదృష్టకరమని మందకృష్ణ మండిపడ్డారు. అసెంబ్లీలోనూ బయటా పోరాటం చేయకుండా కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమైపోయారని దుయ్యబట్టారు. సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులతో భారీ యుద్ధభేరి సభను నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సభలో రేవంత్ రెడ్డి పింఛన్లు పెంచుతాడో, లేక పదవి వదులుకుంటాడో తేలిపోతుందని పేర్కొన్నారు. ఆదినుంచి పింఛన్ల పెంపు కోసం పోరాడింది ఎమ్మార్పీఎస్ మాత్రమేనని, ఇప్పటికీ అదే పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 33 జిల్లాల్లో, అనేక నియోజకవర్గాల్లో సన్నాహక సభలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సభకు ఏడీఎల్ ఎల్తూరి సురేఖ, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు దాసారపు ఎల్లయ్య, జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్యతో పాటు పెద్ద సంఖ్యలో వికలాంగులు, పింఛన్‌దారులు హాజరయ్యారు.

# మెట్‌పల్లిలో పారిశుద్ధ్య డ్రైవ్



**శెనార్తి మీడియా,శంకరపట్నం :**

శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ ప్రారంభమైందని పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఇటీవల జ్వరాల కేసులు పెరుగుతుండటంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. డెంగీ కేసులు పెరగకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ర్యాపిడో టెస్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జ్వరం, తలనొప్పి, మెడనొప్పి, నడుము నొప్పి, కీళ్ల నొప్పులు, కళ్లలో మంట లేదా నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా పీహెచ్‌సీని సంప్రదించాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రభా కర్, పంచాయతీ కార్యదర్శి సరిత, ఎంఎల్ హెచ్‌పీ డాక్టర్ మనోచిత్ర, హెల్త్ సూపర్ వైజర్ అనిల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంతంగా మేడారం జాతర నిర్వహణ

- భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడి



**వరంగల్,ఆగస్టు21 :**

ఆసియా ఖండం లోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం 'సమ్మక్క సారలమ్మ' జాతరకు వచ్చే భక్తులకు ప్రశాంతమైన దర్శనం కల్పిస్తాం అని పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు– చేస్తాం అని తెలిపారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే జాతర నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరిగే మేడారం జాతర కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.152.96 కోట్లు–కేటాయించింది. తొలి విడత కింద రూ.150 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో మేడారంలో శాశ్వత నిర్మాణాలు, రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్తు, పారిశుద్ధం తదితర మౌలిక సదుపాయాలు భక్తులకు అందుబాటు–లోకి రానున్నాయి. ప్రతి రెండేళ్లకోసారి మేడారంలో సమ్మక్క, సారలమ్మ జాతర జరుగుతుంది.గత ప్రభుత్వం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదు. తూర్పు నియోజకవర్గంలోని కాలనీలు ముంపుకు గురి కాకుండా ఉండే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. వరద కాలువ నిర్మాణం పూర్తయితే వరంగల్ తూర్పు వరద ముంపు గురి కాకుండా ఉంటుంది. వరంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. వరంగల్‌ను ముంపు ప్రాంతాలు లేని నగరంగా మార్చుతాం' అని మంత్రి కొండా సురేఖ తెలిపారు. కోటి రూపాయల వ్యయంతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు.

# చెన్నూరు ఎస్బీఐ-2లో భారీ స్కాం

- బంగారం, నగదు మాయం

**శెనార్తి మీడియా, చెన్నూరు:**



చెన్నూరు పాతబస్టాండ్‌లోని ఎస్బీఐ–2 శాఖలో కోట్ల రూపాయల స్కాం బయటపడింది. శాఖ క్యాషియర్ రవీందరే దీని సూత్రధారి అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన రెండు రోజులుగా అదృశ్యమవ్వడం ఈ అనుమానాలకు బలం చేకూర్చింది. మేనేజర్ మనోహర్ రెడ్డి సెలవు ముగించుకుని గురువారం విధుల్లో చేరగా బంగారం, నగదుపై అనుమానం కలిగి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. రీజనల్ మేనేజర్ శుక్లా ఆధ్వర్యంలో ఆడిట్ బృందం తనిఖీలు జరిపి నిజాన్ని వెలికితీసింది. సుమారు 330 మంది గోల్డ్ లోన్ ఖాతాదారుల తాకట్టు బంగారం మాయం అయినట్లు తేలింది. మూడు నుంచి నాలుగు కిలోల బంగారంతో పాటు రూ.80 లక్షల–1 కోటి వరకు నగదు అదృశ్యమైందని ప్రాథమిక అంచనా. మొత్తం రూ.5 కోట్ల వరకు అవకతవకలు జరిగి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

**విచారణలో ముఖ్యాంశాలు**

మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన ఆడిట్‌లో విరామం సమయంలోనే ఈ కుంభకోణం జరిగిందని తెలుస్తోంది. మేనేజర్ నమ్మకంతో లాకర్ తాళాలు క్యాషియర్ వద్ద ఉండటమే దీనికి కారణమై ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. రవీందర్ భార్య పేరుతో కోట్ల రూపాయల లావాదేవీలు, ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ అలవాట్లకు సంబంధించిన ఆధారాలు ఆడిట్ బృందం గుర్తించినట్లు సమాచారం.

**లబోదిబోమంటున్న ఖాతాదారులు**

స్కాం వార్తతో ఖాతాదారులు పెద్ద సంఖ్యలో బ్యాంకు వద్దకు తరలివచ్చి ఆందోళన చెందుతున్నారు. తమ తాకట్టు బంగారం పరిస్థితి ఏంటో తెలుసుకోవడానికి గంటల తరబడి నిరీక్షిస్తున్నారు.

**పోలీసుల దర్యాప్తు**

రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు, రూరల్ సీఐలు దేవేందర్‌రావు, బన్సీలాల్, ఎస్‌ఐలు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు మొదలుపెట్టారు. రవీందర్ స్వస్థలం శెట్పల్లిలో సోదాలు జరిపినా అతను కనిపించలేదు."స్కాం మొత్తం ఎంత, ఎవరెవరు ప్రమేయం కలిగిఉన్నారో ఆడిట్ పూర్తైన తర్వాత వెల్లడిస్తాం" అని సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు.

# రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

- బీఆర్ఎస్ నాయకులు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



ఇటీవల వర్షాల కారణంగా పట్టణంలో ఉత్పన్నమైన సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు నగరపాలక కమిషనర్‌ను కోరారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ఆదేశాల మేరకు పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు గాదె సత్యం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పర్యటించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాదె సత్యం మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను వెంటనే పునరుద్ధరించాలని, వినాయక చవితి దృష్ట్యా పట్టణంలో పారిశుద్ధ్య పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంపేటలో డీఎల్‌పీఓ క్షేత్రస్థాయి విచారణ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



శంకరపట్నం మండలంలోని కరీంపేట గ్రామానికి చెందిన వనపర్తి రజిని కొత్త ఇల్లు నిర్మాణం చేపట్టగా అనుమతులు నిలిపివేశారని ప్రజావాణిలో ఫిర్యాదు వచ్చింది. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినట్లు హుజురాబాద్ డీఎల్‌పీఓ పాత శ్రీనివాస్ తెలిపారు. ఫిర్యాదుదారులు, గ్రామస్తుల నుండి పూర్తి సమాచారాన్ని సేకరించినట్లు ఆయన చెప్పారు. విచారణలో వెలుగులోకి వచ్చిన వివరాలను నివేదిక రూపంలో తయారు చేసి కలెక్టర్‌కి అందజేస్తామని పేర్కొన్నారు. ఈ విచారణలో మండల పరిషత్ ఎంపీ ఓ కాసగోని ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి సుమన్, బాధితులు, ఫిర్యాదుదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాల భరోసా సర్వే పకడ్బందీగా చేపట్టాలి

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**




బాల భరోసా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఐదు సంవత్సరాల్లోపు పిల్లల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల భరోసా కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే నిర్వహించిన సర్వేను మరొకసారి సరి చూడాలన్నారు. సర్వే సరిగా చేయకపోతే ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించలేకపోతామని, తద్వారా వారికి ప్రభుత్వం అందించే వివిధ సేవలకు దూరమవుతారని అన్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చాక ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని తెలిపారు. భవిత కేంద్రాల్లోని ఐఆర్‌పీలు సైతం ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల వివరాలు సేకరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సాజిద, పీవో సన, సీడీపీవోలు సబిత, నర్సింగారాణి, సుగుణ పాల్గొన్నారు.

# ఢిల్లీ సీఎంపై దాడి వ్యవహారం

**రేఖాగుప్తాకు జడ్ ప్లస్ భద్రత**

**ఢిల్లీ కమిషనర్‌గా సతీశ్ గోల్చా నియామకం**

**న్యూఢిల్లీ, ఆగస్ట్21 :** ఢిల్లీ సిఎం రేఖాగుప్తాపై దాడితో పరిణామాలు వేగంగా మారాయి. ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను మార్చడంతో పాటు సిఎం రేఖకు జడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పించారు. ఈ క్రమంలో దిల్లీ నూతన పోలీస్ కమిషనర్‌గా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సతీశ్ గోల్చా నియమి తులయ్యారు. ప్రస్తుత సీపీ శశిభూషణ్ కుమార్ సింగ్ స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు. సీఎం రేఖా గుప్తాపై దాడి జరిగిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. గోల్చా ప్రస్తుతం దిల్లీ జైళ్ల డీజీగా విధులు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఆయన నియామకం అమల్లోకి వస్తుందని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొనసాగుతుందని హోంశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇదిలా ఉండగా.. సంజయ్ అరోరా పదవీ విరమణ నేపథ్యంలో ఆగస్టు 1న దిల్లీ సీపీగా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఎస్‌బీకే సింగ్.. హోం గార్డ్స్ డీజీగా కొనసాగనున్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రతివారం నిర్వహిస్తున్న 'జన్ సున్వాయ్' కార్యక్రమంలో దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఫిర్యాదుదారు ముసుగులో వచ్చిన దుండగుడు.. పత్రాలను అందిస్తూ సీఎంపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన ఆటో డ్రైవర్ సకారియా రాజేశ్‌భాయ్ ఖిమ్జీభాయ్(41)గా గుర్తించారు. నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. దిల్లీలోని వీధి కుక్కలను తరలిస్తున్నారనే కోపంతోనే తాను ఈ దాడికి పాల్పడినట్లు– నిందితుడు పోలీసులకు చెప్పినట్లు– జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ముఖ్యమంత్రి రేఖా గుప్తా(51)పై దాడి జరుగడంతో ఆమెకు కేంద్రం 'జెడ్' కేటగిరి భద్రతను కల్పించింది. ఆమె అధికారిక నివాసం, క్యాంప్ కార్యాలయంలో కూడా పారామిలిటరీ బలగాలకు చెందిన విఐపి సెక్యూరిటీ– గ్రూప్(విఎస్‌జి) భద్రత కల్పించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలతో ఢల్లీ ముఖ్యమంత్రి భద్రత బాధ్యతలను సిఆర్‌పిఎఫ్ తీసుకుంది.



## 25 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ చిక్కిన ఎంవీఐ

- డ్రైవర్ తిరుపతి మధ్యవర్తిత్వం
- బాధితుని ఫిర్యాదుతో ఏసీబీ దాడి

**శెనార్తి మీడియా, ఆర్మూర్ :**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) గుర్రం వివేకానంద రెడ్డి 25 వేల రూపాయల లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ ఘటనతో ఆర్మూర్ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న పలువురు అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. డ్రైవింగ్ లైసెన్స్ రిన్యువల్, వాహన ధృవపత్రాల మంజూరు కోసం లంచం డిమాండ్ చేసిన ఎంవీఐ, బాధితుని మధ్య ప్రైవేట్ డ్రైవర్ తిరుపతి మధ్యవర్తిత్వం వహించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ముందుగా కుదిరిన ఒప్పందం మేరకు 25 వేల రూపాయలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఎంవీఐ కార్యాలయంపై దాడి చేసి వివేకానంద రెడ్డి, తిరుపతిని అదుపులోకి తీసుకున్నారు. లంచం కేసులో ఎంవీఐని ఏ1గా, డ్రైవర్ తిరుపతిని ఏ2గా నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. హైదరాబాదులోని నాంపల్లి ఏసీబీ కోర్టుకు వీరిని హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.


## గ్రామాల్లో పనుల జాతర



**శెనార్తి మీడియా,శంకరపట్నం :** పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు శుక్రవారం ప్రతి గ్రామ పంచాయతీలో పనుల జాతర కార్యక్రమం జరగనున్నట్లు ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమై పూర్తయిన పనులను ప్రారంభోత్సవం చేయనున్నారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన కొత్త పనులకు ముగ్గు వేసి ప్రారంభం ఇవ్వనున్నట్లు వివరించారు. పంచాయతీ అధికారులు, కార్య దర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సి బ్బంది తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు కూడా హాజరై సహకరించాలని కోరారు.

## ఇంజనీరింగ్ ఫీజుల పెంపుపై కీలక నిర్ణయం

- అకౌంట్స్, ప్రమాణాల పరిశీలనకు ఆదేశం



**హైదరాబాద్ ,ఆగస్ట్ 21 :** ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీల్లో ఫీజుల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కళాశా లలు అందించే అకౌంట్స్‌తో పాటు–ఆయా కళాశాల్లో విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఫీజులు నిర్ధరించాలని నిర్ణయించింది. ఈమేరకు ఫీజుల పెంపునకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంజినీరింగ్, వృత్తి విద్యా కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ఫేషి యల్ రికగ్నేషన్ అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు సహా విద్యార్థులను పరిశోధ నల వైపు ప్రోత్సహిస్తున్నారా అనే అంశాలను సైతం పరిగణనలోకి తీసుకోనున్నట్టు ఉత్తర్వు ల్లో పేర్కొంది. కాలేజీలు నాణ్యమైన విద్య అందిస్తున్నాయా? ఆ కాలేజీల్లో విద్యార్థులకు ప్లేస్ మెంట్స్ ఎలా ఉన్నాయి అనే అంశాల పైనా దృష్టి సారించనుంది. జాతీయ, అంతర్జా తీయ ర్యాంకింగ్‌లు, ప్రభుత్వ నిబంధనలను ఏ మేరకు అమలు చేస్తున్నారనే అంశాలను సైతం పరిశీలించిన తర్వాతే కళాశాలల్లో ఫీజు లను నిర్ధరించనున్నట్టు–ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.